# ☆ వెన్నెల్లో మానవుడు ☆

రచన: ఆదివిష్ణు

రైలు నడుస్తూంది. వర్షం కురుస్తూంది. ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో ఒక్కణ్ణే కూర్చున్నాను. వున్నకొద్దీ వర్షం ఎక్కువతోవుంది కిటికీలు మూసి ఫాను వేసుకున్నాను. సిగరెట్టు ముట్టించి, రెండు రోజుల క్రితం అన్నయ్య వ్రాసిన ఉత్తరం మళ్ళీ చదవటం మొదలెట్టాను.

'నీ పెళ్లి కోసం అమ్మ తహ తహ లాడుతోంది. ఇది సహజం. నీకు తెలియందేముంది. అమ్మ స్థితి నానాటికి దిగజారి పోతూంది. బ్లడ్ ప్రెషర్ ఎక్కువయింది, ఆమెను చూస్తుంటే నాకు భయంగా వుంది. నీకు ముప్పై యేళ్లు వచ్చాయి. ఇంతవరకూ నీకు పెళ్లి కాలేదంటె మా అందరికీ ఎలా వుంటుందో ఆలోచించు నీకు పెళ్లంటె ఎందుకు యిష్టంలేదు. అదైనా చెప్పు. అనవసరంగా జీవితాన్ని నాశనంచేసుకోకు. ఇంతకంటె ఎక్కువ వ్రాయదలచుకో లేదు. కాలేజీకి శెలవులిచ్చారు కాబోలు. నాలుగు రోజులుండి పోదువుగాని రా. అమ్మకి నిన్ను చూడాలని వుందిట—'

ఇది ఉత్తరంలోని సారాంశం. మళ్ళీ నిన్న వైరిచ్చారు అన్నయ్య, వెంటనే బయలుదేరి రమ్మని. విజయనగరం వెళ్లక తప్పేందికాదు.

అన్నయ్యతో నాలుగు రోజులు గడపాలంటె నాకేం ఇబ్బంది కాదు. అయితే ఆయన నా పెళ్లివిషయం కదిపి ఆ నాలుగు రోజులు కాస్తా నరకమయం చేస్తారు. తెలుసు నాకు.

ఎమ్మె పాసయాను. లెక్చరర్ గిరి వెలిగిస్తూన్నా. చదువుతోపాటు పదవూ ప్రతిష్ఠా సంపాయించాను. అయినా. జీవితానికి సుఖంలేదు. విమలే నా సుఖం! చెయిదాటి పోయింది. ఇందుకు ఆమెనని ప్రయోజనం లేదు. ఇదంతా నా అసమర్థత - చేజేతులా చేసుకున్నాను అంతా నా హృదయంలో భద్రంగా దాచుకున్నా.

నా బాధ తెలియని అన్నయ్య నన్ను పెళ్లి చేసుకోమని బలవంతం చేస్తూన్నారు. పెళ్లి . — హృదయంలో వున్న ప్రేమనంతా ఖర్చుపెట్టేశాను. ఇంకెవర్నీ ప్రేమించటం నా చేతకాదు. ప్రేమలేని పెళ్లి నాకిష్టంలేదు. నన్ను పెళ్ళిచేసుకున్న జీవిని నేను సుఖపెట్టలేను. లోకం కోసం ఆమె మెడలో ఉరితాడు కట్టలేను. అయినా అన్నయ్య నన్ను బలవంతం చెయ్యక మానరు. వయస్సు ముదురుతూన్నా బ్రహ్మచారిగా వుంటానంటె వూరుకుంటారా పెద్దవాళ్లు. నా విషయం వాళ్లకు తెలిస్తే - ?

విమల నా మరో ప్రాణం! ఆమెను మనసారా ప్రేమించాను. మా తొలి పరిచయం కాలేజి వాతావరణంలో జరిగినా, ఆషామాషీగా ఆకతాయిగా జరగలేదు. నేనంటె ఆమెకి విపరీతమైన అభిమానం.

ఆమె కలక్టరుగారి అమ్మాయి. మా నాన్నగారికి అంత హోదా లేకపోయినా, ధన రూపేణా 'వున్నవాళ్ళ' కోవకే చెందుతాం. అన్నయ్యా, నేనూ - యిద్దరమే సంతానం. మేమేది అడిగితే అది క్షణాల్లో అమిర్చి పెట్టేవాళ్లు. అతి గారాబంగా పెరిగాం.

కాలేజి డిబేట్సులో విమలతో పరిచయమయింది. ఆమె మాటాడ్తూంటే ఎంత కమ్మగా వుంటుందో - గంటలతరబడి వుంటున్నా విసుగనిపించదు దానికితోడు ఆమెలో విషయ పరిజ్ఞానం విపరీతంగా వుండేది. ప్రతి విషయాన్నీ తూచి తూచి మాటాడేది.

ఆమెకీ నాకు డిబేటులో పోటీ పడింది. ప్రతి సంవత్సరం పోటీలో నాదే పైచెయ్యిగా వుండేది. కాని ఆనాడు ఆమె ముందు నిలబడలేకపోయాను ఆమె వాగ్ధాటి ప్రత్యర్థినైన నన్నే ఆశ్చర్య చకితుణ్ణి చేసింది. ప్రైజు ఆమె పరమైంది.

మిత్రులంతా యీ విపరీత పరిణామానికి ఆశ్చర్యపోయారు. ఒక ఆడపిల్ల ముందు నిలబడలేని నన్ను గేళి చెయ్యకపోయినా నా పరాజయానికి చింతించారు.

విమల మా కాలేజికి రావటం యీ సంవత్సరమే. గత సంవత్సరం ఏలూరులో చదువుకొందట. మా కాలేజికి వచ్చిరాంగానే యింతపేరు సంపాయించుకుందంటే ఆమె అదృష్టమేకాక మరేమవుతుంది!

ఇంతవరకూ అవమానం ఎలాంటిందో తెలియని నాకు యిది అంపపు కోతగా తయారయింది. రెండురోజులసలు కాలేజీకే వెళ్లలేదు తర్వాత నా అమాయకత్వానికి నవ్వుకున్నాను కాలేజికి వెళ్లడం మొదలెట్టాను.

ఎందుచేతనో పాఠాలు నా బుర్రకెక్కేవి కావు. ఆమె క్లాసులో కనుపించటమే తడవు నిలువునా కృంగి పోయేవాణ్ణి. ఆమెని చూట్టానిక్కూడా ధైర్యం చాలేది కాదు. ఒక్కోసారి కారణంలేనిదే ఆమె మీద విపరీతమైన కోపం వచ్చేది. దాచుకునేవాణ్ణి.

ఇదివరకు నాకున్న ప్రత్యేకత రోజురోజుకూ తగ్గుతున్నట్టు ఫీలవుతూండేవాణ్ణి యూనివర్సిటీ వక్తృత్వ పోటీలకు వెళ్ళమన్న లెక్చరర్ల ప్రోత్సాహాన్ని గూడా తృణీకరించాను. మళ్ళీ ఈ జన్మలో డిబేట్సులో పాల్గొనరాదని నిశ్చయించుకున్నాను. ఇది కేవలం నా అజ్ఞానమేనని తెలిసినా, నా నిశ్చయాన్ని మార్చుకోలేక పోయాను.

నన్నింత స్థితికి తీసుకొచ్చిన విమల మీద రోజు రోజుకు పెరుగుతూన్న ద్వేషాన్ని చంపుకోటానికి సర్వవిధాలా ప్రయత్నించిన నన్ను, నేనే అభినందించుకుంటాను యిప్పటిక్కూడా.

కాని విమల విచిత్రమైన మనో ప్రవృత్తి కలది. నన్ను జయించాననే

ధీమా, గర్వం కించిత్తుకూడా లేదు. ఒక రోజు నన్ను రూంలో కలుసుకుంది. యూనివర్సిటీ పోటీలకు రమ్మని ప్రాధేయపడింది. తనకు ప్రైజు రావటం కేవలం కాకతాళీయమని – నా బాధ నర్థంచేసుకున్న విమల నన్ను ఓదార్చింది. ఇది విడ్డూరం కాదూమరి!

ఏది ఏమైనా నేనా సంవత్సరం యూనివర్సిటీ పోటీలకు వెళ్లలేదు. విమల వెళ్లింది జయంతో తిరిగి వచ్చింది. కాలేజి అంతా ఆమెని అభినందించారు. కాలేజికి తలమానికమని పొగిడారు. నాకై నేను ఆమెను కలుసుకోలేదు.

ఆమే స్వయంగా నా రూంకొచ్చింది. తను గెలుపొందినట్టు చెప్పింది. తప్పదన్నట్టు–ఆమెని అభినందించాను. తర్వాత ఏవో కాలేజి విషయాలు మా మధ్య కదిలాయి.

రోజులు దొర్లేకొద్దీ ఆమె నాకు మరీ దగ్గరవుతూంది. ప్రతి సాయంకాలమూ ఆమె పనిగట్టుకుని నన్ను కలిసేది. ఏవో సారస్వత, రాజకీయ విషయాలు కోరి మాటాడేది. నన్నూ మాటాడించేది. ఆ రీత్యా ఆమెపై నాకున్న ద్వేషం కొంత కాకపోయినా కొంతైనా తగ్గిపోయింది.

ఒక రోజు ఆమె వాళ్ల నాన్నగారికి పరిచయం చేసింది నన్ను. నా గురించి ఆయనకు కొస్త ఎక్కువగానే చెప్పి వుంటుంది. ఆయన సహృదయులు, మంచి మన్ననా తెలిసినవారు. ఆ రోజు నుంచీ వాళ్లింటో నేనూ ఒక సభ్యునిలా మెలిగాను.

మా మధ్య ఆత్మీయత వృద్ధిపొందింది. ఆమెపైనద్వేషం ఎప్పుడో రూపు మాసింది. కలిసి మెలిసీ తిరుగుతూండే వాళ్లం. మనసులో ఏమి దాచకుండా మాటాడుకునే వాళ్లం. — ఇక్కడ ఒక విషయం చెప్పక తప్పదు. ఆమెను ప్రేమించాన్నేను. అయితే యీ విషయం మాత్రం నా హృదయంలోనే వుండి పోయింది. ఆమెతో యీమాట చెప్పగల ధైర్యం నాకా రోజుల్లో లేకపోడం నిజంగా నా దురదృష్టమే. ఎన్ని విషయాలు నిర్భయంగా మాటాడటం జరిగినా యీ ప్రేమ మాట మాత్రం మామధ్య కదిలేది కాదు. దీనికి పూర్తిగా కారణం నేనే ననుకుంటాను.

ప్రతి మనిషికీ ఏవో బలహీనత వుంటుంది. నాకూ వుంది. 'నేను నిన్ను ప్రేమిస్తున్నా' నన్నమాట ఆమెకి చెప్పలేకపోయాను. అప్పట్లో ఆ ధైర్యముంటె నా జీవితానికే పెద్ద మార్పు జరిగి వుండేది. దానికిప్పుడు చింతించినా లాభం లేదు.

పరీక్షలు జరిగాయి. ఇద్దరం పాసయ్యాం. విమల నాన్నగారికి కాకినాడ ట్రాన్స్ఫరయింది. వెళ్ళిపోయారు.

మనం ప్రేమించిన వ్యక్తులు దగ్గర్లో వున్నదానికి దూరంగా వున్నదానికీ చాలా వ్యత్యాస ముంటుంది. ఇది స్వానుభవం. విమల నేనూ దగ్గరున్నన్నాళ్ళూ రోజులు తెలిసేవికావు. ఆమె కాకినాడ వెళ్లిందగ్గర్నుంచి ఏదో వెలితి ఫీలయ్యేవాడ్ని. ఆ వెలితిని కొంతవరకు ఉత్తరాల ద్వారా తీర్చుకునేవాడ్ని.

విశాఖపట్టణం ఎమ్మే చదవటానికి వెళ్లాను. విమల చదువు మానుకుంది. సెలవల్లో మా వూరువస్తూ కాకినాడలో దిగేవాడ్ని. ఒకటీ రెండు రోజులు అక్కడ గడిపి వచ్చేవాడ్ని. కనీసం ఆరోజులైనా నన్ను విమలకి అర్థం చెయ్యలేకపోయాను. అప్పుడుకూడా 'నిన్ను ప్రేమిస్తున్నా' నని చెప్పలేకపోయాను. ఆ ఒక్క మాట అనుంటె ఏమయ్యేది? నానోటికేమి దొబ్బిడాయి వచ్చిందని అనలేకపోయాను? – ఇప్పుడు విచారిస్తున్నా కాదు ఏడుస్తున్నా. గతం తిరిగిరాదు.

నా ప్రీవియస్ కోర్సు పూర్తయే సరికి ఆమెకి పెళ్లయి పోయింది. వాళ్లనాన్నగారు ఇంజనీరుకిచ్చి తనహోదాకి తగ్గట్టుగా పెళ్లి చేసారు. అదృష్టం చేతులారా జారవిడుచుకున్నాను.

ఈ పెళ్లి విమల కిష్టమేనా? – ఇదే ప్రశ్న నన్ను నాటి మాటికి రెచ్చగొట్టేది. ఆమె నన్నే ప్రేమించివుంటె యీ పెళ్లికి వప్పుకుంటుందా? నన్ను ప్రేమించకపోతె నాపై యింత అభిమానం ఎందుకు? నా ప్రతి విషయాన్నీ తన విషయంగా భావించటం దేనికి? – అయినా నా ప్రేమ విషయం చెపితే ఏదో తెలిసేదిగా. ఆమె తిరస్కరిస్తే మనసు గట్టిచేసుకుని మరో ఆమెని పెళ్ళిచేసుకొనేవాడ్ని. అన్నయ్యా, అమ్మకీ నా గురించి ఏ బెంగా వుండేది కాదు. ఇదంతా నా ఖర్మం.

ఈ సంఘటనలన్నీ గడిచి యిప్పటికి ఏడెనిమిదేళ్లయి పోయింది. అయినా విమల నాకు యిప్పటికీ గుర్తే. మరచిపోదామని ఎంతో ప్రయత్నించాను. అనుకున్నంత సులభంకాదు. అన్నయ్య మాట ప్రకారం మరో ఆమెని పెళ్ళిచేసుకుంటె? సుతరామూ మనసు అంగీకరించటం లేదు. ఇప్పటికైనా అన్నయ్యకి అన్నీచెప్పి నన్నింక వొత్తిడి చెయ్యకండని హెచ్చరించాలి.

రైలు స్టేషన్లో ఆగింది. తలుపు తెరిచి చూశాను. రాజమండ్రి. కాఫి తాగటానికి ప్లాటుఫారం మీదికెళ్లాను. కాఫీతాగి పత్రిక కొనుక్కుని కంపార్టుమెంటులోకి రాబోయాను.

ఎవరో ఆమె ముఖాన్ని చేతుల్లో దాచుకుని కంపార్టుమెంటు ఓమూల సీట్లో కూలబడి వుంది. నా అలికిడి విని తలెత్తి చూచింది. ఆమెను చూచిన నేను నిశ్చేష్టుడయ్యాను.

ఆమె విమల!!

నా వంక యింకా చూస్తూనే వుంది. ఆనందం, విషాదం, ఆవేశం – కలగా పులగంగా ఆమె ముఖంలో చదివాను. నిముషాలు నిశ్శబ్దంగా గడిచాయి మా మధ్య.... తర్వాత ఆమే పలుకరించింది.

“మీరా....” లేచి నించుంది.

“కూర్చోండి. ఎక్కడికిలా వంటరిగా ప్రయాణం చేస్తున్నారు. ”నేనూ కూర్చుంటూ అడిగాను.

“కాకినాడ వెడుతున్నా. నాన్న రిటైరయి యిల్లు అక్కడే కట్టుకున్నారు.” ఆమె పూర్తిగా మారిపోయింది. ఆనాటికళ యీనాడు ఆమెకిలోపమయింది. ఆమె ప్రతిమాటలో నైరాశ్యం గోచరిస్తుంది.

" మీరెక్కడి కెడుతున్నారు- " ఆమె అడిగింది.

"విజయనగరం అన్నయ్య దగ్గరికి.... క్షేమంగా వున్నారా?" ఎన్నో అడగాలను కుంటున్న నాకు అన్ని మాటలూ గుర్తు కొచ్చి చావడంలేదు

ఆమె పేలవంగా నవ్వేసి మౌనం వహించింది.

"పిల్లలా ?" ఇది మరొకప్పుడైతే చిలిపి ప్రశ్నగా వుండేదేమో.

"లేరు.... మీరు... మీకు పెళ్ళయిందా?"

"లేదు."

ఆమెలో ఆశ్చర్యం స్పష్టంగా కనుపించింది. ఎందుకన్నట్టు కళ్ళతో అడిగింది.

"ఇప్పటి వరకూ చేసుకోవాలనిలేదు. ఇక ముందెంజరుగుతుందో చెప్పలేను. అమ్మా నాన్నా కులాసాయేనా."

"మీరు నా పెళ్ళయిందగ్గర్నుంచీ రావటమే మానేశారు. ఉత్తరాలు నా కోసం కాకపోయినా కనీసం నాన్నగారికైనా వ్రాయటంలేదు. ఇలా మారిపోయావే!" నూతిలో గొంతుకలా అంది విమల

నేను సమాధానం చెప్పలేకపోయాను. అలాగని మా మధ్య నిశ్శబ్దాన్ని గూడా భరించలేకపోతున్నాను. ఈమెతో ఏం మాటాడాలి? ఏం మాటాడకూడదు?

రైలు గట్టిగా కూత పెట్టి కదిలింది.

ఆమె అప్రియత్నంగా ముఖాన్ని చేతుల్లో దాచుకుని సన్నగా ఏడుస్తుంది, నా హృదయంలో శూలంపెట్టి కెలికినట్టయింది. ఇంతలోనే ఎందుకామెకింత మార్పు?

"అరె.... మీరు— మీరు—" నామాట పూర్తి కాకముందె ఆమె అంది.

"ఏడుస్తూన్నాను. నా జీవితానికి ఏడుపొస్తుంది రావ్! ఇంకేం చెప్పమంటావ్ చెప్పు—" ఆమె కళ్ళనుంచి నీళ్లుధారలుగా కారుతున్నాయి. బండరాయిలా వుండిపోయాను. క్షణాలు గడిచాయి.

"ఒక్క విషయం అడుగుతాను. దాచకుండా చెపుతారుకదూ!" తలూపాను.

మీరు నన్ను ప్రేమించారా?" నావైపు తీక్షణంగా చూస్తూ అంది "చెప్పండి. ఏమిదాచకుండా చెప్పండి సమాధానం. నన్ను ప్రేమించారా?" రెట్టించి మళ్ళీ అడిగింది.

ఆశ్చర్యపోయాను. ప్రేమించానని చెప్పాను.

"మరి— ముందు నాకెందుకు చెప్పలేదు."

"విమలా!-"

"అవును మీ విమలే అడుగుతుంది. నోరువిప్పి నిన్ను ప్రేమిస్తున్నానని ఎందుకు చెప్పలేదు. జీవితంలో నేను సుఖపడ్డం మీకిష్టంలేదా? చెప్పండి రావ్!" నిగ్గదీసి అడిగింది.

"మీకిప్పుడు దానివల్ల కలిగిన లోటేమిటి?" ఆమె భర్త ఇంజనీరు గుర్తుకొచ్చాడు నాకు.

"లోటు — జీవితమే పెద్దలోటు. మీరు చేసిన పొరపాటుకిది తగిన లోటు మిమ్మల్నని లాభంలేదు! ఇదంతా నా పాపం! నేనే చేతులారా చేసుకున్నాను. అనుభవించక తప్పదు." ఆమె కుళ్ళికుళ్ళి ఏడుస్తుంది. అప్పడనిపించిందినాకు యీమె దాంపత్యం సుఖదాయకంగా లేదని మళ్ళీ ఆమే మాటాడింది

"చదువుకుని, పదవుల్లో వున్నవాళ్ళందరికీ సంస్కార ముంటుందనుకోటం భ్రమ! ఇది నిజం రావ్! నేనేనాడు చేసుకున్న పాపమో! యమయాతన అనుభవిస్తున్నాను. వారు - తాగుబోతు - జూదరి అని ఒక్కటేమిటి అన్ని వ్యసనాలూ వున్న పెద్దమనిషి! ఆ యింట్లో నాకుసుఖశాంతులు లేవు. రోజూ సభ్యత మరచి నన్ను బాధపెట్టటం మినహా మరోటి ఆయనకు తెలియదు. డబ్బు కావాలి! ఎంత? తృప్తిలేదు. నా ముఖం చూడరు. నేను వారి కంటికి నలుసుని - చీడ పురుగుని - ఇది చాలా రావ్! ఇంకా చెప్పాలా?" ఆమె ఏడ్చింది బిగ్గరగా. నాగుండె లవిసేలా, నా నవనాడులూ కృంగిపోయేలా ఏడిచింది.

"విమలా!-" ఆమెమీద జాలి కలిగింది నాకు.

"ఆనాడె మీకుచెప్పాల్సింది -మిమ్మల్ని ప్రేమిస్తున్నానని. భయపడ్డాను, మీరేమనుకంటారోనని, ఏవిధంగా భావిస్తారోనని చెప్పలేక దాచుకున్నాను. నాకీ శిక్ష జరగాల్సిందే రావ్!" ఆమె అన్న ప్రతిమాటలో నిజంకాకపోలేదు పాపం!- సరిగ్గా నా స్థితే యీమెకీ సంభవించిందా? నోరున్నా మూగవాళ్ళమయి జీవితాన్ని నరకమయం చేసుకున్నాం. అయ్యో - నేను, కాను, మేమిద్దరమూ దురదృష్టవంతులమే.

"విమలా-" నాకూ ఏడుపొచ్చింది.

"మీరు మగవాళ్లు. నేను ఆడదాన్ని. నోరువిప్పి చెప్పగల చొరవ మీకుండాలి. ఆలోచించండి రావ్! మీరెందుకు చెప్పలేరు నన్ను ప్రేమిస్తున్నానని. పోనీండి. మిమ్మల్ని నేనర్థం చేసుకోగలను, అంతా మరచిపోండి పెళ్ళి చేసుకుని మీరైనా సుఖపడండి." ఆమె చూపు మరెక్కడో నిలచింది

సుఖం! నాకొసుఖం, దానికి నోచుకోలేదు నేను. ఒక చిన్న మాటకోసం జీవితాల్ని తారుమారు చేసుకున్నాం. పోనీ ఆమైనా సుఖపడ్తుందనుకుంటె - ఎండమావై పోయింది.

అలాంటప్పుడు విమల దెన్నాళించి పెళ్ళికి వప్పుకుంది. సుఖపడదామనుకుందా? చివర్ని యిలా జరుగుతుందని తెలుసుకోలేకపోయింది పాపం!- జీవితంలో ఫెయిలయింది.

"అంతా అనుకోకుండా జరిగిపోయింది విమలా! వగచి ప్రయోజనం లేదు. ఈ జన్మకింతే. మీ వార్ని మంచిదారిని పెట్టుకో." సలహా యిచ్చాను.

"చక్కటి మాట చెప్పారు. ఇంతకు ముందు శక్తివంచనలేకుండా వారిని మార్చటానికి నాన్నా, నేనూ ప్రయత్నించాం. లాభంలేదు. ఆ మనిషి మారరు, నేనా

(తరువాయి 18 వ పేజీలో)

విషయములు. షుమారు 24 శతాబ్దుల పూర్వమే హిందువులకు నిట్టి యుద్గ్రంథములు రచింపగలశక్తి సామర్థ్యములుండుట యెంతయు గర్వింపదగిన విషయము. ఇతర దేశములకన్న మున్నుగ నింత రాజ్య పరిపాలనా విజ్ఞాన మెఱింగిన దేశముయొక్క ప్రస్తుత పరిస్థితి విచారించిన మనోక్లేశము గల్గుగపోదు. మన నుండియే నిషయ పరిజ్ఞానము గ్రహించి పాశ్చాత్యులు మనకు నేర్పుచున్నారు. మన చరిత్రలే మనకు యితరులు నేర్పు గతి పట్టినది. ఇంత ఉత్తమ విజ్ఞానము గల్గిన మనము మన రాజ్యాంగము నేర్పరచు సమయములో, అమెరికా నుండియు, ఇంగ్లాండు నుండియు కొన్ని సూత్రములు గైకొని మనుటయే ఆత్మాన్యత్వము గల హైందవునకు విచారము కల్గింపకపోదు.

---

## వెన్నెల్లో మానవుడు

(11 వ పేజీ తరువాయి)

యింట్లో ఒక్కక్షణం వుండలేను. వుండను. ఒక్క విషయం చెపుతాను రావ్! వారితో నా పెళ్ళి జరగటానికి కొంత నా స్వార్థం పనిచేసింది ఒక పక్క మీమీద అనురాగం కూడదని చెపుతూన్న స్త్రీ సహజమైన ప్రేరేపణ యిక్కడ బాగా పని చేసింది నేననుకున్నాను - మీరు నన్ను ప్రేమించడం లేదని — కాదు అలా అని సర్దిపెట్టుకున్నాను. నన్ను నేనే మోసం చేసుకున్నాను. అనుభవిస్తున్నాను. మీ అభిప్రాయాన్ని అడిగి తెలుసుకుందామనే జ్ఞానం, సహనం నాకప్పట్లో లేకపోవటం కేవలం నా దురదృష్టం. ఇప్పుడు దానికి చింతిస్తున్నా అజ్ఞానమే అవుతుందిరావ్!" ఆమె ప్రతిమాటలో నిజం వినిపించింది

నేను నిట్టూర్చాను. ఆమెకి జరిగిన అన్యాయానికి చింతించాను. ఇ రెండే నేను చేసిన, చేస్తున్న, చేయగల పనులు

ఆమె సామర్లకోటలో దిగిపోయింది. ఇంటి రమ్మని ప్రాధేయపడింది. వీలుంటే వచ్చేటప్పుడు వస్తానని మాట యిచ్చాను. ఆమె దిగిపోతూ అంది-

"మీరు త్వరగా పెళ్ళిచేసుకుంటే సంతోషిస్తా! మనం చేతులారా చేసుకున్నదంతా మరచిపోండి. వుంటాను నా మనసేం బాగోలేదు. ఏ క్షణంలో ఏమవుతానో నాకే తెలియదు. ఛస్తే చావనూవచ్చు. జీవచ్ఛవంలా బ్రతకనూ వచ్చు. నేను కోరేదల్లా మీ పునర్దర్శనం- అదీ అతిత్వరలో. సెలవు రావ్."

ఆమె వెళ్ళిపోయింది. ఆమె చివరి మాట ఎప్పటివరకూ నా చెవుల్లో రింగుమంటున్నాయి ఆమె దీనవదనం యిప్పటివరకూ నా కళ్ళల్లో మెదులుతుంది. ఇలా జరగడంలో తప్పు చేసిందెవరు? నేను!- కాదు- ఆమె! కాదు విధాత!

ఎవరుచేసినా ఫలితం మాత్రం ఘోరం. అప్రయత్నంగా నా రెండు కళ్ళనుంచీ రెండు వేడి కన్నీటి బొట్లు జల జలా రాలాయి.

◆ ◆ ◆

ఈ కథ యిలా యింకా యెంతవరకు సాగిపోయేదో తెలియదు కాని— మధ్యలో నన్నెవరో తాకారు ఉలిక్కిపడ్డాను. చూస్తే ఎదురుగా పున్నమి వెన్నెల్లో గోపాలంగాడు నవ్వుతూ కనిపించాడు.

"ఏం రోయ్ ఏదో పారవశ్యం పొందుతున్నావ్. పక్కింటి పద్మగాని గుర్తొచ్చిందేమిటి ఖర్మంకాలి" లే ... లే పదయింది రేపు ఆఫీసుందన్నమాట మరచిపోకు" పానకంలో పుడకలా యీ కథకి మధ్య ఆఫీసు గుర్తుచేసి నా మనసు కాస్తా పాడు చేసాడు గోపాలం.

నా బాధ తెలుసుకున్న వెన్నెల ఫక్కున నవ్వింది; "చూశావా నా మజా!" అని హెచ్చరించింది దాసోహం అన్నాను నిజం మరి! నాలాంటి కుబాల్రావ్ గుమాస్తాకి యీ వెన్నెల రాత్రి నిజంగా ఒక వరం! ఇలాంటి వెన్నెల్ని నాలాటి మానవుడు వృథాచేసుకోటం శుద్ధ తెలివి తక్కువ పని!

ఈ కథలోని విమల - నా లెక్చరర్ పదవీ - మా వంకర జీవితాల మధ్య విషవలయాలూ - ఇవన్నీ కేవలం వెన్నెల ప్రసారమే! వెన్నెలకీ మానవుడికీ యింత చుట్టరికం వున్నదని నా కిప్పుడే తెలిసొచ్చింది. (మా గోపాలంగాడి తర్వాత గాని తెలిసిరాదు, ఆ కాసేపూ - చిత్రగుప్తుడి తాలూకు చిట్టాల్లాంటి ఫైళ్ళు, వాటిపైన "అర్జంటనే" ఎర్రరంగు తేళ్లూ, యమ ధర్మరాజుకి సాక్షాత్తూ వారసులైన ఆఫీసర్లూ - సర్వం మరచిపోయాము. చాలీ అదృష్టం నాకూ, నాలాటి మానవులకి.

---

## నగరంలో నాటకరంగం

(16 వ పేజీ తరువాయి)

సంగీతం శ్రీ రామానుజులు బృందం వారిచ్చారు. శ్రీ రామానుజులు ఇతర రూపకాలలోని బాణీలను ఇష్టంవచ్చినట్లు వాయించకుండా, కొత్తకొత్త ట్యూనులు యివ్వగలిగివుంటే నాటకానికి గౌరవ జనకంగా వుండేది. వారు వాయించే ట్యూనులు ఏసందర్భంలో, ఏపాటకి పాడినవో తెలిసిన వ్యక్తులెవ్వరూ రారనుకోవడం మంచిది కాదు

శ్రీ విజయలక్ష్మి అనుకుంటాను-(పేరు ప్రకటించలేదు- గాయకిని పరిచయం చెయ్యనూలేదు)- ఈమె పాడిన రెండు గేయాలు చక్కగా వినసొంపుగావున్నాయి. వీటిని కూర్చిన "సత్యం శంకరమంచి" కి అభినందనలు.

యీ నాటక సమాజం గర్వపడతగినంత చక్కగా వున్నది. సెట్టి అలంకరణ - నిర్వహణ - లైటింగ్ ఇవి యీ నాటకానికి జీవం పోసినాయి.

మొత్తంమీద ప్రదర్శన స్మరణీయమైనది. ఇంకా ఉత్తమ కళాఖండాలను తీసుకొని, ఉదాత్తమైన స్థాయిలో ప్రదర్శించగల సమర్థత, ఉత్సాహం యీ సమాజం వారికి ఉన్నాయి ప్రదర్శించగలరని ఆశిద్దాం.

---